క్లుప్తంగా

కంప్యూటర్ సైన్స్‌లో రవిరామ్‌కు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో కొలిపాక రవిరామ్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, సంయుక్త రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య ఎం.రామకృష్ణ పర్యవేక్షణలో 'రౌటింగ్ ప్రోటోకాల్ ఆప్టిమైజేషన్ ఆఫ్ డబ్ల్యూఎస్ఎన్ఎస్ ఫర్ అండర్ వాటర్ ఎకొస్టిక్ అండ్ మెడికల్ అప్లికేషన్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా రవిరామ్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఏయూ విద్యార్థులకు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్


స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్ సాధించారు. విభాగానికి చెందిన 11 మంది విద్యార్థులు రూ.70 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య నాగరాజకుమారి, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ పైనాపిల్ కాలనీ అంబేడ్కర్ ఫీడర్ పరిధిలో ఈ నెల 26న మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శ్రీకాంత్‌నగర్, కనకమహాలక్ష్మినగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్, టీఐసీ పాయింట్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ఎంఎస్‌కే ప్రసాద్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మానసిక వికలాంగ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: భారత క్రికెట్ టీం సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ జన్మదిన వేడుకలను హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి దరి పాఠశాల ఆవరణలో ఎంఎస్‌కే ప్రసాద్ స్నేహితులు కిషోర్, శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు వీడియో కాల్ ద్వారా ఎంఎస్‌కేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కండిపిల్లి శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీ విద్యాపరిషత్‌లో అతిథి ఉపన్యాసం

ఎంవీపీ కాలనీ: స్థానిక ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యాపరిషత్ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. డిఫరెంట్ ఈక్వేషన్స్ ఏజ్ మ్యాథమెటికల్ మోడల్స్ అనే అంశంపై గణితశాస్త్ర నిపుణులు ఆచార్య వసుంధరాదేవి, ఆచార్య లక్ష్మీకాంతన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీవీపీ కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాధిక, పాల్గొన్నారు.

తూర్పులో జనసంద్రం


నామినేషన్ వేయడానికి పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణ నామినేషన్
- ఆరిలోవ నుంచి కలెక్టరేట్ వరకు బైకులు, ఆటోలు, కార్లతో భారీ ర్యాలీ
- హాజరైన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, మేయర్ గొలగాని

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నామినేషన్ ఘట్టం బుధవారం అట్టహాసంగా సాగింది. వేల సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజలతో నియోజకవర్గంలో రహదారులు కిటకిటలాడాయి. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఇక్కడ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట అర్చకులు పూజలు చేశారు. పాస్టర్లు, ముస్లిం మత పెద్దలతో ప్రార్థనలు చేశారు.


నామినేషన్‌కు భారీ ర్యాలీగా తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, చిత్రంలో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

అనంతరం ర్యాలీకి శ్రీకారం చుట్టారు. రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పలు వార్డుల వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో కలిసి ఎంవీవీ సత్యనారాయణ ప్రచార రథంపై ర్యాలీ కొనసాగించారు.

ప్రచార రథం వెంట ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వైఎస్సార్‌సీపీ జెండాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పోస్టర్లతో కదం తొక్కారు. ఆరిలోవ కాలనీలో ప్రారంభమైన ఈ ర్యాలీ దుర్గాబజార్, టీఐసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, డెయిరీఫారం, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పూఘర్, ఎంవీపీ కాలనీ, ఉషోదయ కూడలి, విశాఖ కంటి ఆస్పత్రి, సిరిపురం కూడలి, సెవెన్ హిల్స్ ఆస్పత్రి, పందిమెట్ట కూడలి, జిల్లా పరిషత్ వరకు సాగింది. అక్కడి నుంచి ఎన్నికల నిబంధనల మేరకు అవసరమైన వారితో కలిసి ఎంవీవీ కలెక్టరేట్‌లోకి వెళ్లి తూర్పు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న జన ప్రభంజనాన్ని చూస్తుంటే తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

పరుగు తీస్తూ.. ఉత్సాహం నింపుతూ..

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నామినేషన్ ర్యాలీ ఎంతో ఉత్సాహంగా సాగింది. పెద్ద సంఖ్యలో యువత, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక 20వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎంవీవీకి పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గుమ్మడి కాయతో ఎంవీవీకి దిష్టితీశారు. ఎంవీవీ ప్రయాణిస్తున్న ప్రచార వాహనం ముందు పార్టీ సీనియర్ నాయకుడు జి.వెంకటేశ్వరరావు(జీవీ) పరుగు తీస్తూ యువతలో ఉత్సాహాన్ని నింపారు.


ర్యాలీలో ఎంవీవీ వాహనం ముందు యువకులతో కలిసి పరుగెడుతున్న జీవీ


ఆరిలోవలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి నామినేషన్ వేయడానికి బయలు దేరుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంవీవీ సత్యనారాయణ,మేయర్ గొలగాని హరివెంకటకుమారి


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ


ప్లకార్డులు, మాస్కులుతో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు

ఆకర్షణీయంగా ఒంటెలు, గుర్రాలు

ఎంవీవీ నామినేషన్ ర్యాలీలో డప్పులు, వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాటితో పాటు ఒంటెలు, గుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుర్రాలపై యువకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంవీవీ చిత్రాలతో ముద్రించిన టీ షర్టులు ధరించి స్వారీ చేసి ఆకట్టుకున్నారు. వాటి వెనక పార్టీ జెండాలతో ఠీవీగా నడుస్తూ ఐదు ఒంటెలు సందడి చేశాయి. ఈ ర్యాలీలో కార్పొరేటర్లు ఉమ్మడి స్వాతి, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి, గేదెల లావణ్య, మువ్వల లక్ష్మి, గుడ్ల విజయసాయి, పల్లా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ సెల్ జోన్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మత్స్యకార కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పేర్ల విజయచందర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు వానపల్లి ఈశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

కదిలిన అభిమాన దండు


ర్యాలీలో పాల్గొన్న వాహనదారులతో కిక్కిరిసిన అప్పుఘర్ కూడలి

ఆరిలోవ: నామినేషన్ ర్యాలీలో ఎంవీవీకి దారి పొడవునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ర్యాలీ ప్రారంభించినప్పుడే 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ గుమ్మడి కాయతో హారతి ఇచ్చి దిష్టి తీశారు. తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు బూడిత గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. దారి పొడవునా మహిళలు, యువకులు ఎదురుగా వెళ్లి జేజేలు పలికారు. పార్టీ మహిళా కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అభ్యర్థి ఎంవీవీ చిత్ర పటాలు, ఫ్యాన్ బొమ్మలు, ప్లకార్డులు ప్రదర్శించారు.


28వ వార్డు నుంచి బైకు ర్యాలీగా వెళ్తున్న పల్లా దుర్గారావు, కార్యకర్తలు

అప్పుఘర్ కూడలిలో అఖండ హారతి

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ప్రజలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు ఘన స్వాగతం పలికారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఎంవీవీ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి భారీ ర్యాలీగా ఎంవీపీ కాలనీ సెక్టార్-9 అప్పుఘర్ కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు పేర్ల విజయచందర్, వాసుపల్లి ఎల్లాజీల ఆధ్వర్యంలో పదిహేను మంది వార్డు మహిళా నాయకులు ఎంవీవీకి అఖండ హారతినిచ్చారు. 15 గుమ్మిడికాయలతో దిష్టితీసి ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రమణమూర్తి, జ్యోతి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య ఆధ్వర్యంలో ఆదర్శనగర్ వద్ద ఎంవీవీకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిల్లా సత్యవతి, లవణకుమార్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ, ఎంపీ అభ్యర్థి ఝాన్సీకి అప్పుఘర్ వద్ద హారతిపడుతున్న మహిళలు


ఎంవీవీ నామినేషన్‌కు బైకులపై ర్యాలీగా వెళ్తున్న 16వ వార్డు ప్రజలు

ఎంవీవీ నామినేషన్‌కు తరలిన జనం

బీచ్ రోడ్డు: ఎంవీవీ నామినేషన్‌కు జనాలు తరలి వెళ్లారు. బైకులు, ఆటోలు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లి ఎంవీవీకి మద్దతు తెలిపారు. జీవీఎంసీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో, జీవీఎంసీ 22వ వార్డు నుంచి పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో, జీవీఎంసీ 21 వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి రవి అధ్వర్యంలో బైకులు, 100 ఆటోలు, కార్లతో భారీ ర్యాలీగా నామినేషన్‌కు తరలివెళ్లారు. జీవీఎంసీ 16వ వార్డు నుంచి కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, విశాఖ తూర్పు ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా ఎంవీవీ నామినేషన్‌కు తరలి వెళ్లారు. బైకులు, ఆటోలతో పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్నారు.


జీవీతో కలిసి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న 18వ వార్డు నాయకులు


వైఎస్సార్‌సీపీ జెండాలుతో వెళ్తున్న ఒంటెలు


ర్యాలీలో గుర్రాలపై వెళ్తున్న యువకులు


డప్పులతో యువకుల సందడి


22వ వార్డు నుంచి తరలివెళ్తున్న యువకులు

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీతల గోవింద్


28వ వార్డులో ఇంటింటికి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం ముమ్మరం చేశారు. జీవీఎంసీ 22వ వార్డులో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ బుధవారం మంగాపురం కాలనీలో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు.

మంచి ర్యాంకులు సాధించాలి

మురళీనగర్: పాలిసెట్‌లో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. 176 మందికి ఉచిత శిక్షణ ఇచ్చామని, పాలిసెట్ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పులో 9 నామినేషన్ల దాఖలు

ఆరిలోవ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తూర్పు నియోజకవర్గం నుంచి 9 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ముల్లపూడి వీర వెంకటసత్యనారాయణ(ఎంవీవీ) రెండు సెట్లు వేయగా.. అదే పార్టీ నుంచి ముల్లపూడి నాగజ్యోతి మరో రెండు సెట్లు వేశారు. వీరితో పాటు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కొంగరపు గణపతిరావు, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఇ.పీటర్ జోసఫ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి గుత్తుల శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థిగా బర్ల అప్పల పద్మాకర్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారు. వీరంతా నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఐఐపీఈలో మైక్రో-సిటీ రీసెర్చ్ ఫెసిలిటి ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ పెట్రోలియం ఎనర్జీలో కొత్తగా ఏర్పాటు చేసిన మైక్రో కంప్యూటెడ్ టొమెటోగ్రఫీ(మైక్రో-సిటీ) రీసెర్చ్ ఫెసిలిటీని సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్ డైరెక్టర్(ధన్‌బాద్) ఆచార్య అరవింద్ కుమార్ మిశ్రా బుధవారం ప్రారంభించారు. ఐఐపీఈలో చేపడుతున్న పరిశోధన సంబంధ ప్రగతిని అరవింద్ కుమార్ మిశ్రా అభినందించారు. గ్రీన్‌హైడ్రోజన్ సంబంధితంగా చేస్తున్న పరిశోధనల్లో సంయుక్త భాగస్వామ్యాన్ని స్వాగతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్, రిజిస్ట్రార్ ఆచార్య దీపక్ అంబన్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.


రీసెర్చ్ ఫెసిలిటీని ప్రారంభిస్తున్న ఆచార్య అరవింద్ కుమార్ మిశ్రా

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

23వ వార్డు సిద్ధం సభలో ఎంపీ ఎంవీవీ


సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం శ్రీరామ కళావేదిక వద్ద బుధవారం మేము సిద్ధం మా బూత్ సిద్ధం సభ కార్పొరేటర్ గుడ్ల విజయసాయి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు 100 శాతం నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ప్రజలను కోరారు. చంద్రబాబు చెబుతున్న కల్లిబొల్లి మాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, గుడ్ల సత్యారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.